కథా కౌముది



# మా ఇంట్లో దయ్యాలున్నాయి!

తోట ప్రసాద్

పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
కౌముది నిర్వహించిన కథల పోటీ (2021)లో
సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ

**ఆ అపార్ట్‌మెంట్** బయటినుంచి చూస్తే పాతదిగా ఉంది.

కాని లోపల మేము అద్దెకి తీసుకుందామనుకుంటున్న ఫ్లాట్ మాత్రం ఇంటీరియర్ చాలా బాగుంది.

ముఖ్యంగా ఆ అయిదవ అంతస్తులోని బాల్కనీ నుంచి చూస్తుంటే, నగరం కనబడుతోంది. సాయంత్రం వేళల్లో టీ తాగుతూ, కబుర్లు చెప్పుకోవడానికి ఆ సిటవుట్ చాలా బాగుంటుందనిపించింది.

రాత్రివేళల్లో – బీన్ బ్యాగ్‌లో – అలా విశ్రాంతిగా వెనక్కివాలి వెన్నెల కలలని గమనించవచ్చు. 'వేయిపడగలు'లో అనుకుంటాను విశ్వనాథ సత్యనారాయణగారు ఏ తిథిన చంద్రకళ ఎలా ఉంటుందో వివరంగా వర్ణించారు.

అప్పటినుంచి వెన్నెల కాంతుల్లో తేడా అర్థమైంది. ప్రతిరాత్రి ఆకాశంతో మాట్లాడటానికి డాబామీద జంపఖానా పరుచుకుని, వెన్నెల కాంతితో వళ్ళంతా నింపుకునేవాడిని.

విదేశాల్లో అయితే 'మూన్ వాచింగ్' అనేది ఒకటి ఉంటుందట. ప్రతి రాత్రీ వెన్నెల్లో తడిసిపోవడం. చంద్రకాంతులు మనసుమీద విపరీతమైన ప్రభావం చూపిస్తాయి. కొంతమంది పిచ్చివాళ్ళవుతారట.

ఇదెక్కడో చదివినప్పటినుంచి – వెన్నెల కనబడనివ్వకుండా, ముఖం చాటేసుకుని బతుకుతున్నాను.

మళ్ళీ ఇన్నాళ్ళకి ఆకాశం, చంద్రుడు కనబడుతున్నారు. ఈ ఒక్క కారణంతోనే ఆ ఇల్లు అద్దెకి తీసుకోవడానికి ఓ.కే అనేశాను.

మంచిరోజు చూసుకుని, ఆ ఇంట్లోకి మారిపోయాం నేనూ, నా భార్య గీత, కుమార్తె మనోజ్ఞ.

ఇల్లంతా సర్దేసుకున్న మూడోరోజు బాల్కనీలో ఓ పెగ్ ఫిక్స్ చేసుకుని, బాసిం పట్టు వేసుకుని కూర్చున్నాను.

ఆకాశంలో అష్టమి చంద్రుడిని చూస్తున్నాను. లలితా సహస్రనామాల్లో 'అష్టమీ చంద్ర విభ్రాజ దళికస్థల శోభితాయైనమః' అని అమ్మవారిని వర్ణించారు. అంటే అమ్మవారి నుదురు అష్టమి చంద్రుడిలా ఉంటుందని.

నిజంగానే అష్టమి చంద్రుడు – సరిగ్గా సగానికి కోసిన వెనీలా కేక్‌లా ఉంటాడు.

అష్టమి చెడ్డదంటారు. కాని శ్రీకృష్ణుడు అష్టమి రోజునే, శ్రీరాముడు నవమి రోజునే ఎందుకు పుట్టాడో గ్రహించరు.

శుక్ల పక్షంలో అయినా, కృష్ణ పక్షంలో అయినా చంద్రుడు ఒకేలా ఉంటాడు. సరిగ్గా సగానికి అంటే వెలుతురు పక్షం అయినా, చీకటి రోజులయినా ఒకేలా ఉండటమే చంద్రుడి లక్షణం.

జీవితంలో కష్టసుఖాలు సమంగా స్వీకరించి, స్థితప్రజ్ఞతతో బతకాలని చెప్పడం కోసమే శ్రీకృష్ణుడు అష్టమిని తన పుట్టినరోజుగా ఎన్నుకున్నాడంట.

అంత బ్యాలెన్స్ ఆఫ్ మైండ్ మనుషులకి సాధ్యమా? ఎంత అష్టమి చంద్రుడిని చూస్తే మాత్రం.

మొబైల్ రింగవుతోంది. డిస్‌ప్లే చూస్తే రామ్ మోహన్ నాయుడు. ఓ జర్నలిస్ట్ ఫ్రెండ్.

ఫోన్ తీయకపోతే బాగుండదనుకుంటూ ఆన్సర్ చేశాను. "ఏంటన్నా ఈ టైములో ఫోన్ చేశావు?' అనడిగాను.

"డిస్ట్రబ్ చేశానా?" అన్నాడు నాయుడు.

"నువ్వు చేయడమే భాగ్యం. డిస్ట్రబెన్స్ ఏముంటుంది? ఊరికేనా? ఏదన్నా పనుందా?" అనడిగాను.

నాయుడు "ఆ మధ్య ఎవరితో బయోపిక్ రీసెర్చి చేస్తున్నావు అన్నావు కదా"

"అవును."

"ఆ సినిమా అనౌన్స్‌మెంట్ వచ్చింది. డైరెక్టర్ తన వాయిస్‌తో ఫస్ట్‌లుక్ వదిలాడు. యూ ట్యూబ్‌లో ఇప్పుడే చూశాను " అన్నాడు నాయుడు.

సమాధానం చెప్పలేనంత నిశ్శబ్దం అయిపోయాను.

ఓ నాయకుడి జీవితం చాలా ఆసక్తిదాయకంగా అనిపించి, అతని అనుమతి తీసుకుని అతని జీవిత విశేషాలను, ఆసక్తిదాయకమైన ఘట్టాలను ఆరునెలలపాటు కష్టపడి తిరిగి సేకరించాను. దానికి ఆ నాయకుడు కొంత మొత్తం ఇచ్చాడు.

ఓ మూడువారాల క్రితం – ఓ దర్శకుడు నన్ను పిలిపించాడు. ఆ బయోపిక్ తీయాలనుకుంటున్నట్లు, అప్పటికే ఆ నాయకుడి అనుమతి తీసుకున్నట్లు చెప్పాడు.

నేను కథ చెప్పాను. పేపర్‌మీద కథతోపాటు, వన్‌లైన్ ఆర్డర్ కూడా అడిగాడు ఆ దర్శకుడు.

నిజ జీవితానికి నేను చేసిన సినిమాటిక్, డ్రమెటిక్ మార్పులతోపాటు స్క్రిప్ట్‌ని డిటిపి చేయించి, ఆ దర్శకుడికి మెయిల్ చేశాను.

ఓ.కే అన్నాడు. హీరో ఓ.కే అయిన తర్వాత రెమ్యునరేషన్ మిగిలిన డిటైల్స్ మాట్లాడదామన్నాడు.

ఇప్పుడు రచయితకి కూడా చెప్పకుండా డైరక్ట్ ప్రాజెక్ట్ ఎనౌన్స్ చేశాడు.

విపరీతమైన కోపం, బాధ వచ్చింది. కనీసం పదిహేను లక్షలనుంచి పాతిక లక్షల రూపాయల వరకూ రావలసిన డబ్బు పోతోంది.

నాకు రావలసిన డబ్బునే కాదు – నా అక్షరాలను, ఆలోచనలని కొట్టేశాడు.

ఫోన్ చేశాను. తీయలేదు ఆ దర్శకుడు. ఆపకుండా చేస్తుండటంతో చివరికి తీశాడు ఆ దర్శకుడు. నాకంటే ఎక్కువ మత్తులో ఉన్నాడా దర్శకుడు.

"బయోపిక్ మీద రైట్స్ ఏంటి? నా పాయింటాఫ్ వ్యూలో కథ చెబుతున్నాను" అన్నాడా దర్శకుడు.

"మరి నా వన్ లైన్ ఆర్డర్? నేను చేసిన డ్రమెటిక్ ఛేంజెస్" అని నేను అడుగుతుండగానే ఫోన్ కట్ చేశాడా దర్శకుడు.

అది బయోపిక్ అయినప్పటికీ నేను రాసిన స్క్రిప్ట్ పునాది మీదనే ఆ సినిమా రుపొందుతోంది అనేది నాకు అర్థమవుతోంది. కాని ఏవిధంగానూ పోరాడలేని పరిస్థితి.

ఆవేశాన్ని అణుచుకోలేక తాగుతున్న గ్లాసు బాల్కనీ రెయిలింగ్ కేసి కొట్టాను. ముక్కలు ముక్కలైపోయింది. అందులోని మందు రెయిలింగ్ మీద మరకగా అంటుకుని బొట్లు బొట్లుగా కిందకి జారుతోంది.

"ఏమైందీ?" అని పరిగెత్తుకుంటూ వచ్చింది నా భార్య.

చెప్పాను.

"ఏంటో ఈ ఇంట్లోకి రాగానే ఇలా అయింది" అంది గీత దిగులుగా.

"నా కెరీర్‌కి, ఈ ఇంటి వాస్తుకి ఏదన్నా సంబంధం ఉందా?" అని అరిచాను.

నాలోపల ఓ అనుమానం మొలకెత్తింది.

అనుకోకుండా వారం రోజుల్లో చాలా సంఘటనలు జరిగాయి.

నాకూతురికి నీట్‌లో అనుకున్నట్లు రాంక్ రాలేదు. వేరే కోర్సులో చేరమంటే మొండికేసింది. మళ్ళీ కోచింగ్ తీసుకుంటానంది. అదో అదనపు ఖర్చు.

మూడవుట్‌లో ఉండగా, కారు పార్కింగ్ నుంచి తీస్తుంటే కారు పక్క డోరు పిల్లర్‌కి కొట్టుకుంది.

నల్లకారు మీద అసహ్యంగా వంకరటింకరగా గీతలు. ఒరిజినల్ సర్వీస్ సెంటర్‌కి పంపిస్తే, నలభైవేల బిల్లు.

ఇంకోరోజు స్టౌ మీద కుక్కర్ పేలబోయినంత పనయ్యింది. ప్రెషర్ మూత కింద గాస్కెట్ ఏదో లూజయి, పైకి చిమ్మింది. వంట గది గోడలమీద, వంట గట్టుమీద కుక్కర్లోలోని పెసరపప్పు అన్నం చిమ్మింది.

గీత ఒక్కసారిగా వణికిపోయింది. "ఎందుకిలా జరుగుతోంది?" అంది.

"ఒకటయితే యాదృచ్ఛికం అనుకోవాలి. వరుసగా జరుగుతుంటే, మన ఊహకి అందనిది ఏదో ఉంది" అన్నాను.

ఆ మరుసటి రోజు నాకు తెలిసిన వాస్తు సిద్ధాంతి టి.ఎమ్.రావు ఇంటికి వచ్చాడు. ఈస్ట్ ఫేసింగ్, మిగిలిన గదులు. అన్ని వాస్తుప్రకారమే ఉన్నాయన్నాడు.

జ్యోతిష్యం కూడా చెక్ చేసుకుందామని హేమసుందర్‌ని పిలిపించాను. అతను మా ముగ్గురి జాతకాలు చూసి, జాతక దశలుకాని, గోచార దశలుకానీ అన్నీ బాగున్నాయన్నాడు.

మరింకేంటి?

మా చుట్టూ నెగెటివ్ ఎనర్జీ ఉందా? ఆ సాయంత్రం నేనూ, నా భార్య, కుమార్తె ముగ్గురం ఇదే అంశం మాట్లాడుకున్నాం.

ఆ నెగెటివ్ ఎనర్జీ నరఘోష? జనాలు ఏడ్చేంత బ్రైట్‌గా ఏమీలేను. కనీసం సోషల్ మీడియాలో నా పోస్టులకి వేలకొద్దీ కూడా లైకులు రావడంలేదు.

అసలు నెగెటివ్ ఎనర్జీ ఏంటి?

ఎదురింట్లో ఉండే చందన మా ప్రశ్నకి సమాధానం చెప్పింది.

"మీ ఇంట్లో దయ్యాలున్నాయి"

మా ఆవిడ ఎదురింటావిడతో మాకన్నా ముందు మా పోర్షన్‌లో ఎవరు ఉండేవారని అడిగితే చెప్పిన సమాధానం ఇది.

మా ఆవిడ భయపడింది. నేను నవ్వాను.

"పరమాత్మకే ఈ భూమి మీద చోటులేదు. ఇక ప్రేతాత్మలు ఎక్కడుంటాయి? నిజంగా దయ్యాలు వుంటే దయ్యాల మీద కథలు రాయరు, సినిమాలు తీయరు" అని నా సినిమా నాలెడ్జితో మాట్లాడాను.

చందనని టీకి పిలిచాం.

ముందు మా ఆవిడ, మా అమ్మాయి తనతో మాట్లాడుతున్నారు నెమ్మదిగా నేనూ జాయిన్ అయ్యాను.

"ఇంతకుముందు ఈ పోర్షన్‌లో ఫ్యామిలీ ఉండేది. సూసైడ్ చేసుకుని చచ్చిపోయారు" అంది చందన.

అందరమూ ఒక దిగ్భ్రమలో ఉండిపోయాం. నేనే ముందుగా తేరుకుని, "అయితే ఆత్మహత్య చేసుకున్నోళ్ళు దెయ్యాలు అయ్యారన్నమాట. మరి నాకు తెల్లచీరకట్టుని ఏ ఆడదెయ్యం కనిపించలేదు" అని నవ్వాను.

"చచ్చిపోయింది – మగతను అయితే ఆడదెయ్యం ఎందుకు కనబడుతుంది?" అంది చందన.

"వెంకటేశ్వరరావుగారు కూడా ఎప్పుడూ ఇక్కడే మీరు కూర్చునే ప్లేస్‌లోనే కూర్చుని, మాట్లాడుతుండేవారు."

చందన మాటలు వినగానే ఒళ్ళు ఝల్లుమంది.

"చనిపోయిన అతని పేరు వెంకటేశ్వరరావా? అనారోగ్యమా? ఆర్థిక ఇబ్బందులా? ఎందుకు ఆత్మహత్య చేసుకున్నాడు?" అనడిగాను.

చందన వెంకటేశ్వరరావు కుటుంబం గురించి చెప్పడం మొదలుపెట్టింది.

మేముండే పోర్షన్‌లో వెంకటేశ్వరరావు కుటుంబం ఉండేది. మాలాగే ముగ్గురూ మాత్రమే ఉన్న కుటుంబం. భార్యాభర్తలు, కూతురు.

వెంకటేశ్వరరావు సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేసేవాడు. అతని భార్య స్కూల్‌లో టీచర్. కూతురు పద్మిని ఇంజనీరింగ్ కాలేజీలో చదువుతుండేది.

పద్మిని కాలేజ్‌లో ఎవరో అబ్బాయిని ఇష్టపడిందట.

తల్లిదండ్రులిద్దరూ ఉద్యోగ బాధ్యతలమీద ఇంట్లో ఎక్కువ ఉండేవాళ్ళు కాదు.

వయసులో ఉన్న అమ్మాయి కాబట్టి (అందంగా ఉండేదట. అని చందన చెప్పింది. లేకపోయినా ఆడపిల్ల కాబట్టి అలాగే ఆబగా చూసేవారని నా ఉద్దేశ్యం) ఫ్లాట్స్‌లో ఉన్నవారందరూ పద్మినికేసి చూస్తుండేవాళ్ళట.

ఒకరోజు పద్మిని తన మిత్రుడితోపాటు (బహుశా బోయ్‌ఫ్రెండ్ అనాలేమో?) తమ ఫ్లాట్‌కి వచ్చింది. ఆ సమయంలో ఆమె తల్లిదండ్రులులేరు.

ఆ అబ్బాయి వచ్చి గంట అయింది. అదే ఫ్లాట్స్ సూపర్ వైజర్, రియల్ ఎస్టేట్ బిజినెస్ చేసే రామకృష్ణకి ఏ పనీపాటా ఉండేదికాదు.

గడియపడిన తలుపుల వెనక ఓ అమ్మాయి – అబ్బాయి ఏం చేస్తున్నారనే క్యూరియాసిటీ, సమాజంలో నైతికత, విలువలని కాపాడే గురుతర బాధ్యత తనమీద ఉందని రామకృష్ణ ఫీలయ్యేవాడు.

అందుకని తలుపులు దబదబా బాదాడు.

లోపల ఉన్నవారు తలుపు తీయలేదు. దానితో ప్లాట్స్‌లో మిగిలినవాళ్ళని తీసుకొచ్చి, తలుపులు విరక్కొట్టినంత పనిచేశాడు రామకృష్ణ.

చివరికి ఈ గొడవకి తలుపులు తీశారు. ఆ అబ్బాయి పారిపోబోయాడంట. రామకృష్ణ బ్యాచ్ తరిమారు. చివరికి ఆ కుర్రాడు తప్పించుకున్నాడు.

వెంకటేశ్వరరావు ఇంటికి వచ్చేంతవరకూ అపార్ట్‌మెంట్ పెద్దలందరూ అక్కడే కూర్చున్నారు.

వెంకటేశ్వరరావుని నిలదీశారు. చెడామడా తిట్టారు. “ఇది మర్యాదస్తుల సముదాయం అనుకున్నావా? బ్రోతల్ హౌస్ అనుకున్నావా? నీ కూతురు పడుకుని, సంపాదించిన డబ్బులతో బతుకుతున్నావా? పట్టపగలే నీ కూతురు బోయ్‌ఫ్రెండ్స్‌ని పిలిపించుంటుందా?” ఇలా ఎన్నెన్ని అనుమానాలో అన్నీ నిందలుగా, తిట్లుగా, మర్యాదకరమైన బూతు మాటలుగా వ్యక్తం చేశారు.

వెంకటేశ్వరరావు పేలవమైన గొంతుతో అందరికీ 'సారీ – సారీ ' అన్నాడు.

ఆ మరుసటి రోజే వెంకటేశ్వరరావు టెర్రస్ మీదున్న వాటర్‌టాంక్ దగ్గర కూర్చుని, ఏదో పురుగుల మందు తాగి చనిపోయాడు.

కొద్దిరోజులకే అతని భార్యా, కూతురు ఇద్దరూ ఖాళీ చేసి వెళ్ళిపోయారు.

అదీ 'చందన' చెప్పిన 'ఆత్మ' సారీ గతం కథ.

వెంకటేశ్వరరావు ఆ ఇంట్లోనే దిగులుగా కూచున్నట్లు కనబడ్డాడని, వాచ్‌మాన్ భార్య చెప్పడంతో ఆ ఫ్లాట్ వైపు చూడటానికే అందరూ భయపడ్డారు.

అలాంటి ఫ్లాట్‌లోకి మేము వెదుక్కుంటూ వచ్చి, మరీ దిగాం.

చందన చెప్పిన ఈ ఉదంతంతో నా భార్యా, నా కూతురు మరింత డిస్టర్బ్ అయ్యారు.

"ఎవరనన్నా పిలిపించుకుని, పూజలు చేయించుకుందామా?" అనడిగింది నా భార్య.

నేను హారర్ థ్రిల్లర్స్ చాలా రాసినా, దయ్యాలు, ఆత్మలు ఇలాంటి వాటిమీద నాకు నమ్మకంలేదని ఇంట్లో వాళ్ళందరికీ తెలుసు.

నేను సమాధానం ఇవ్వలేదు.

ఆ వెంకటేశ్వరరావు దయ్యం ఆలోచనలవల్ల నా భార్యా, కూతుళ్ల కళ్లల్లో భయం కనబడుతోంది.

ఆ మరుసటి రోజు నేను హౌస్ బ్రోకర్ మహేష్‌కి ఫోన్ చేశాను. "మంచి త్రీ బెడ్‌రూమ్ ఫ్లాట్ ఏదన్నా ఉంటే చూడమని.

ఆ సమయంలో నా భార్యా కూతుళ్ళు అక్కడే ఉన్నారు.

"మీకు నమ్మకం కుదిరిందన్నమాట. ఆ దయ్యాలు ఉన్నాయా?" అంది గీత.

"ఇంత క్లియర్‌గా కళ్లకి కనబడుతుంటే లేవని ఎలా అంటాను?" అన్నాను.

"డాడీ నిజంగా మీకు దయ్యాలు కనబడ్డాయా?" అని నాకూతురు మనోజ్ఞ షాకయ్యి అడిగింది.

"మనమెంత మారినా అందరి టార్గెట్ ఆడపిల్లలే. ఆడపిల్లల మీద అఘాయిత్యాలంటే రేప్‌లు, పెట్రోలు పోసి తగలపెట్టడమే కాదు. క్యారెక్టర్ అసాసినేషన్ చేయడం. నవ్వితే లైనేస్తుంది అంటారు. పార్టీలు చేసుకుంటే పడుకుంటుందంటారు. నలుగురితో మాట్లాడితే లూజ్ క్యారెక్టర్ అంటారు.

ఆ అమ్మాయి నాకెవరో తెలియదు. ఒకవేళ తన బోయ్‌ఫ్రెండ్‌తో రొమాన్స్ చేయాలనుకుంటే ఏ హోటల్ రూముకో, రిసార్ట్‌కో వెళ్ళి ఉండేది.

ఇంటికి తెచ్చుకునేది కాదు.

ఒకవేళ ఇంటికి తీసుకొచ్చినా, రొమాన్స్ చేసినా అది ఆ అమ్మాయి సమస్య. ఆ ఫ్యామిలీ సమస్య.

ఈ మోరల్ పోలీసింగ్ పేరిట, పరాయి కుటుంబాల మీద నిఘావేసే అలాంటి వెధవలకు ఓ పనిష్మెంట్ ఉండదు.

దయ్యాలు ఉన్నాయని నేననుకోను. నమ్మను. కాని ఓ ఆడపిల్ల తండ్రిని నీ కూతురు బజారుది అని ఒక రాజముద్ర వేసి, ఆ తండ్రి నిస్సహాయంగా ఆత్మహత్య చేసుకునేలా చేసిన ఇలాంటి మనుషులు దయ్యాలు కాక మరేమిటి? ఇలా ఈ కనబడే దయ్యాల మధ్య ఓ ఆడపిల్లని పెట్టుకుని, నేను బతకలేను. అందుకే ఇల్లు ఖాళీచేద్దాం" అన్నాను.

నా భుజాన్ని ఎవరో చరిచినట్లు అనిపించింది.తిరిగి చూస్తే ఎవ్వరూ లేరు.

ఆ అభినందన వెంకటేశ్వరరావుదా?

COMMENTS